క్లుప్తంగా

91.72 శాతం పింఛన్ల పంపిణీ



బట్టేపాడులో వృద్ధురాలు ఎద్దలపూడి శీనమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు శ్రావణి

ఆత్మకూరురూరల్: మండలంలోని 11 సచివాలయాల పరిధిలో రెండో రోజు శనివారానికి 91.72 శాతం సామాజిక పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. మొత్తం 4,993 పింఛన్లకు 4,580 మందికి రూ.1,26,99,750 నగదును వలంటీర్ల ద్వారా అందజేశామన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యాధికారులు

కలిగిరి: స్థానిక పీహెచ్‌సీలో టీబీ వ్యాధిగ్రస్తులకు శనివారం వైద్యాధికారిణి బి. గీతారెడ్డి పౌష్టికాహారం పంపిణీ చేశారు. మండలంలో టీబీ వ్యాధికి మందులు వాడుతున్న వారికి జిల్లా టీబీ నియంత్రణ అధికారి సూచనలతో పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ ఎస్టీఎస్‌ఎస్ శివ, సీటీసీ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

జలాశయంలోకి చేపల వేటకు వెళ్లొద్దు

సోమశిల: తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో సోమశిల ప్రాజెక్ట్‌లోకి జాలర్లు చేపల వేటకు వెళ్లొద్దని మత్స్యశాఖ ఉపసంచాలకులు శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చే అవకాశాలు ఉన్నందున వేటకు వెళ్లొద్దని అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

వై ఏపీ నీడ్స్ జగన్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సాయికుమార్

అల్లూరు: 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి'పై త్వరలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, టౌన్ కన్వీనర్ దండా కృష్ణారెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికి తిరిగి జగనన్న ప్రభుత్వంలో జరిగిన లబ్ధిని వారికి తెలియజేసి 2024లో కూడా జగనన్నే ముఖ్యమంత్రిగా చేసుకోనే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భక్తవత్సలరెడ్డి, చెంతాటి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడి పూజ



పడి పూజలో భక్తులు

ఆత్మకూరు: పట్టణంలోని స్పార్క్ సిటీలో అయ్యప్ప స్వాములు శనివారం రాత్రి పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. గణపతి, అయ్యప్ప, సుబ్రహ్మణ్యం స్వాముల విగ్రహాల ప్రతిమలను కొలువుదీర్చి వేదికను సుందరంగా అలంకరించారు. సుమారు వంద మందికిపైగా అయ్యప్ప స్వాములు పూజల్లో పాల్గొని భజనలు నిర్వహించారు.

అయ్యప్ప భక్తుల మెట్ల పూజ

చేజర్ల: అయ్యప్ప మాల ధరించిన భక్తులు శుక్రవారం రాత్రి స్థానిక సాయి కల్యాణ మండపంలో వైభవంగా మెట్ల పూజ నిర్వహించారు. భక్తులకు వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత షేక్ సిరాజుద్దీన్ దంపతులు భిక్ష ఏర్పాటు చేశారు. మాలధారణ భక్తులు శనివారం శబరిమలకు బయలుదేరారు.

గిరిజన కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

అల్లూరు: తుపాను కారణంగా భారీ వర్షాలు కురిసే తరుణంలో మండలంలోని గిరిజన కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ నెల్లూరు జిల్లా చైర్మన్ దాసరి పోలయ్య అధికారులను కోరారు. మండలంలో 32 కాలనీల్లో గిరిజనులు నివసిస్తున్నారన్నారు. ఎక్కువ మంది గుడిసెలలో నివసిస్తున్నారు. ఈ మేరకు తహసీల్దార్ కె చంద్రశేఖర్, ఎంపీడీఓ జ్యోతికి వినతిపత్రం అందజేశారు.

పేదల ప్రాణప్రద పాలన జగనన్నది

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలో పేదలను ప్రాణపదంగా చూసుకునే పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. కావలి పట్టణంలోని 5వ వార్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు బుక్‌లెట్లను అందజేశారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో సంపన్న వర్గాలు, పేద వర్గాల మధ్య సమానత్వం తీసుకువచ్చారన్నారు. దళిత, గిరిజన, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల వారిని ఉన్నత స్థానాల్లో కూర్చో బెట్టారని చెప్పారు. చంద్రబాబు పాలనకు, జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మధ్య తేడాలను ప్రజలు గమనించాలని కోరారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని గుర్తు చేశారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మహిళలను నమ్మించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత నిలువునా మోసం చేశాడన్నారు. జగనన్న వచ్చిన తర్వాత డ్వాక్రా రుణాలన్నింటినీ 60 లక్షల మంది అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. 60 లక్షల మంది మహిళలకు సున్నా వడ్డీకి రుణాలిచ్చారని, 45 ఏళ్లు దాటిన మహిళలకు చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ. 18,500 డబ్బులు ఇస్తున్నారన్నారు. ప్రతి దశలోనూ మహిళలకు అండగా నిలిచారు. రైతుల విషయంలో చంద్రబాబు దగా చేశారన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పి.. బ్యాంక్‌ల్లో తాకట్టు పెట్టిన బంగారాన్ని వేలం వేయించి రైతు కుటుంబాలను ఆర్థికంగా చిన్నాభిన్నం చేశాడన్నారు. రుణమాఫీ మొత్తాన్ని ఐదు విడతల్లో ఇస్తానని, రెండు విడతలు ఇచ్చిన మోసం చేసి దగా కోరు ఉన్నారంటే అది ఒక చంద్రబాబు మాత్రమేనన్నారు. పిల్లలకు చదువే భవిష్యత్ అని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేల రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వ పరంగా చేయగలిన అన్ని వనరులను వినియోగిస్తూ రాష్ట్రంలో పేదరికాన్ని ఐదేళ్లలో సగానికి తగ్గించిన ఘనత సీఎందేన్నారు. ప్రజల ఆత్మాభిమానం దెబ్బతినకుండా సంక్షేమం అందించడంలో ఈ ప్రభుత్వం విజయవంతమైందన్నారు. గతంలో గ్రామాల్లో జన్మభూమి కమిటీలు టీడీపీ కార్యకర్తలను పెట్టి వారి గుప్పెట్లోనే పథకాలు పెట్టారని, కలెక్టర్ దగ్గరకెళ్లినా జన్మభూమి కమిటీల వద్దకే వెళ్లాలనే దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ఎవరూ ఎవరి వద్దా తలవంచి దండం పెట్టాల్సిన అవసరం లేదని, అభివృద్ధి, సంక్షేమం అందుకోవడంలో ఓ గౌరవం ఉందని చెప్పారు. మరో 20 ఏళ్లు జగనన్న ప్రభుత్వం కొనసాగితే సమాజంలో చాలా మార్పు వస్తుందన్నారు. ఈ మార్పు రాకుండా ఉండాలనే టీడీపీ, పచ్చమీడియా కుట్రలు చేస్తోందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జనిగర్ల మహేంద్ర యాదవ్, కాటా శ్రీనివాసులురెడ్డి, పాసుగోటి అనురాధ, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, కుందుర్తి కామయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వండి

• ఎంపీపీ లక్ష్మీదేవి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగమణి

మర్రిపాడు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీపీ గంగవరపు లక్ష్మీదేవి సూచించారు. శనివారం మర్రిపాడు మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయాల పరిధిలోని ప్రతి పంచాయతీ పారిశుధ్య నిర్వహణ పాటించాలని కార్యదర్శులను, అధికారులను ఆదేశించారు. సరిగా పనిచేయని బోర్లకు వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. తుపాన్ పొంచి ఉండడంతో చెరువులు ఉన్న గ్రామాల్లో సంబంధిత అధికారులు చెరువు కట్టలు తెగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో మాట్లాడి ఆయా గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ పరిమి నాగమణి మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు ఏమైనా చేయాల్సి ఉంటే వాటికి తీర్మానాలు చేసి పంపాలని కోరారు. తహసీల్దారు ఆనందరావు మాట్లాడుతూ చుక్కల భూముల సమస్యలను పరిష్కరించామని, మిగిలిన చుక్కల భూముల సమస్యలు రెండో విడతలో పూర్తవుతాయన్నారు. ఇనాం భూముల సమస్యలు కూడా పరిష్కారిస్తామన్నారు. 20 ఏళ్ల క్రితం ఇచ్చిన అసైన్‌మెంట్ పట్టాల వివరాలు కూడా గుర్తించి వారికి సర్వ హక్కులు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యం

సంగం: మండలంలోని కొరిమెర్ల ఎస్సీ కాలనీకి చెందిన 16 ఏళ్ల బాలిక మూడు రోజుల క్రితం అదృశ్యం కాగా ఎస్సై నాగార్జునరెడ్డి నిర్వహించిన గాలింపు చర్యలతో శనివారం బాలిక ఆచూకీ లభ్యమైంది. కొరిమెర్ల ఎస్సీ కాలనీకి చెందిన 16 ఏళ్ల బాలిక గత నెల 29వ తేదీ అదృశ్యం కాగా 30వ తేదీ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న ఎస్సై గాలింపు చర్యలు చేపట్టగా బాలిక భద్రాచలంలో తమ స్నేహితురాలి వద్ద ఉన్నట్లుగా సమాచారం తెలిసింది.

శ్మశానం అభివృద్ధికి వినతి

ఉదయగిరి: పట్టణంలోని గండిపాళెం రోడ్డు మార్గంలో ఉన్న పురాతన ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ శ్మశాన వాటికలో ముళ్ల చెట్లు, చెత్తా చెదారంతో నిండి నిరుపయోగంగా ఉందని తెలిపారు. త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తామని చైర్మన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో నేతలు షేక్ ఎస్దాని, ముర్తుజా తదితరులు ఉన్నారు.

ఆహార పదార్థాలపై అవగాహన

వరికుంటపాడు: విద్యార్థులు బయట విక్రయించే చిరు తినుబండారాలపై అవగాహన కలిగి ఉండాలని ఏపీ కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర ఈసీ మెంబర్ చల్లగాలి వెంకట్ మోహన్ తెలిపారు. మండలంలోని జడదేవి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ఫోరం ఆధ్వర్యంలో నాణ్యతలేని తినుబండారాలు తినడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్స్ తీసుకోవడం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని వాటికి దూరంగా ఉండాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయాలన్నారు.

పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి

కలిగిరి: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరచడంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని ఎంపీడీఓ జి. వెంకటేశ్వరరావు తెలిపారు. కావలి ముస్తాపురంలో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు అన్ని పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెలుగోటి మధు, పంచాయతీ కార్యదర్శి కిరణ్మయి, సర్పంచ్ సుబ్బనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్షం రోజులు ప్రత్యేక పారిశుధ్య చర్యలు

జలదంకి: మండలంలో డిసెంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సింగయ్య శనివారం తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు పాటిస్తూ మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీల్లో ఏమైనా సమస్యలు ఉంటే అధికారులకు తెలపాలన్నారు.

వికసిత్ సంకల్ప యాత్ర

మర్రిపాడు: మండలంలోని పల్లవోలు, మర్రిపాడు పంచాయతీల్లో శనివారం హౌసింగ్, వ్యవసాయం, అంగన్‌వాడీ, ఉద్యానశాఖ అధికారులతో కలిసి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఎంపీడీఓ నాగమణి నిర్వహించారు. ప్రధానమంత్రి గ్రామీణ ఆవాజ్ యోజన కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి గ్రామీణ ఆవాజ్ యోజన పథకం కింద లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఉజ్వల పథకం కింద 44 మందికి గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. మర్రిపాడు సచివాలయం పరిధిలో ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా 580 కార్డులను పంపిణీ చేస్తామన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

ఆత్మకూరు: పట్టణంలో రెండు రోజుల వ్యవధిలో నలుగురు మృతి చెందడంతో వారి అంత్యక్రియల ఖర్చులకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి బాధిత కుటుంబాలకు రూ.10 వేలు చొప్పున రూ.40 వేలు ఆర్థిక సాయం శనివారం అందజేశారు. జేఆర్‌పేట చింతచెట్ల కాలనీలో నివశించే ఆరిపాటి మాచర్ల, 14వ వార్డు పరిధి బస్టాండ్‌లో నివాసం ఉండే నక్కల లక్ష్మి, 13వ వార్డు పరిధిలోని ఆళ్ల శివరామమ్మ, 16వ వార్డు పరిధిలో షేక్ నాజున్నీ మృతి చెందడంతో ఆయా కుటుంబాలను పరామర్శించి నగదు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పి తిరుపతమ్మ, ట్రస్ట్ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, యానాదిరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ, పులిమి శైలజ, తదితరులుల పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన



రైతులకు డ్రోన్ ద్వారా ఎరువుల చల్లకంపై వివరిస్తున్న దృశ్యం

మర్రిపాడు: మండలంలోని పలు పంట పొలాలను శనివారం ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ శివనారాయణ, వ్యవసాయ శాస్త్రవేత రాజశేఖర్‌రెడ్డి, మర్రిపాడు ఏఓ ఎస్ రామ్మోహన్ బృందం పరిశీలించింది. నానో యూరియా, నానో డీఏపీపై రైతులకు పొగాకు, బొప్పాయి తోటల్లో క్షేత్ర ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. మిరపలో వైరస్ తెగులు గమనించారు. దీని నివారణ కోసం ఎకరాకు స్పైనో సాడ్ 60 మి.లీ. లేదా, అసిటామిప్రిడ్ ఎకరాకు 40 గ్రా. వంతులన పిచికారీ చేయాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ డి.విజయ్‌కుమార్ నాయక్ తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా పొగాకు, బొప్పాయి పంటల్లో డ్రోన్ ద్వారా నానో యూరియా, డీఏపీ, రసాయనిక మందులు ఎలా పిచికారీ చేయాలో క్షేత్ర ప్రదర్శనలో చూపించారు.

పేద విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్



విలేకర్లతో మాట్లాడుతున్న ట్రస్ట్ వ్యవస్థాపకులు

ఉదయగిరి: నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు ఎంఆర్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ట్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యమని ట్రస్ట్ వ్యవస్థాపకులు ముడమాల రమేష్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం ఉదయగిరిలో విలేకర్లతో మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే సీతారామపురం, జలదంకి మండలాల్లో రెండు ట్యూషన్ పాయింట్లను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు విద్య నందిస్తున్నామన్నారు. ఉదయగిరి పాత క్రిసెంట్ పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు బుధవారం నుంచి తరగతులు నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో 30 వరకు ట్యూషన్ పాయింట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరిన్ని వివరాలకు 8197222033 నంబరులో సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో ట్రస్ట్ నిర్వాహకులు బి.కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లించండి



ఆర్డీఓకు వినతి పత్రం అందజేసి సమస్యను వివరిస్తున్న జిల్లా రైతు సంఘం నాయకులు

ఆత్మకూరు: నాలుగేళ్ల క్రితం అనంతసాగరం మండలం మీదుగా నిర్మించిన జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రైతుల నుంచి సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లించలేదని, పరిశీలించి వెంటనే పరిహారం ఇప్పించాలని పలువురు రైతులు, జిల్లా రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు ఆర్డీఓ కె మధులతకు శనివారం వినతి పత్రం సమర్పించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని అప్పట్లో పేర్కొన్న అధికారులు ఆ మేరకు చెల్లించలేదని, భూములు కోల్పోవడంతో జీవనాధారం పోయి రైతులు వ్యవసాయ కూలి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆమె పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

తుఫాన్ ముప్పుపై అప్రమత్తంగా ఉండండి



తుఫాన్‌పై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ



తుఫాను షెల్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ శశిరేఖ, రూరల్ అధ్యక్షుడు బీద రమేష్

• ఆర్డీఓ కె మధులత

ఆత్మకూరు: బంగాళాఖాతంలో తుఫాన్ ప్రభావం అధికంగా ఉన్నట్లు నివేదికలు వస్తుండడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలోని నదీ తీర ప్రాంతాల్లో, వరదకు గురయ్యే లోతట్టు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆత్మకూరు ఆర్డీఓ కె మధులత అన్నారు. తుపాన్ నేపథ్యంలో ఆర్డీఓ కార్యాలయంలో శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పలువురు డిప్యూటీ తహసీల్దార్లకు తుపాన్ సహాయ కార్యక్రమాల విధులు అప్పగించినట్లు ఆమె తెలిపారు. ఆర్డీఓ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు వివరించారు. నదీ తీర ప్రాంతాల్లోని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలను పరిస్థితిని సమీక్షించి ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చేందుకు బాధ్యతలు అప్పగించినట్లు ఆర్డీఓ తెలిపారు. 24 గంటలు రెండు షిఫ్టులుగా ఆర్డీఓ కార్యాలయంలో తుపాన్ కంట్రోల్ రూమ్‌లో అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఎలాంటి సమాచారం ఉన్నా సెల్ 94933 54407 నంబరుకు ఫోన్ చేసి సమాచారం తెలపాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బల్లి నాగేశ్వరరావు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, ఏఓ సుభద్ర, పలువురు తహసీల్దార్లు, డీటీలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి: తుఫాన్ ప్రభావంగా ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు ఉరుములతో కూడిన అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని మండలంలోని రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ ఆంజనేయులు నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరినాట్లు వేసేందుకు, నార్లుపోసే విషయంలో రైతులు వర్షాలు తగ్గే వరకు ఆగాలన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

దుత్తలూరు: తుఫాన్ దృష్ట్యా ఎంపీడీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సాయిప్రసాద్ తెలిపారు. శనివారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎటువంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, ప్రజలకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూమ్ నంబర్ 9100683980కు ఫోన్ చేయాలని కోరారు.

అత్యవసరం సేవలకు కంట్రోల్ రూమ్

చేజర్ల: తుఫాన్ నేపథ్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, ఈఓపీఆర్డీ రామయ్య శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తుఫాన్ హెచ్చరికలు ఉన్నందు వల్ల గ్రామాల్లో వర్ష ప్రభావం వల్ల పారిశుధ్య సమస్య తలెత్తితే 94926 91757 నంబర్‌కు కాల్ చేయాలన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

దుత్తలూరు: తుఫాన్ దృష్ట్యా నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ట్రాన్స్‌కో ఏఈలు మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండి ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చూడాలని నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను కూడా నియోజకవర్గంలోనే అందుబాటులో ఉండి నిత్యం సమీక్షిస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తక్షణ చర్యలు చేపట్టేలా చూసుకుంటానన్నారు. ప్రాణ ఆస్తి నష్టం లేకుండా తగు ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

తుఫాన్ షెల్టర్ పరిశీలన

అల్లూరు: మండలంలోని తీరప్రాంతం ఇస్కపల్లి పంచాయతీలో ఉన్న తుఫాన్ షెల్టర్‌ను ఎంపీపీ శశిరేఖ, వైఎస్సార్‌సీపీ రూరల్ అధ్యక్షుడు బీద రమేష్ పరిశీలించారు. సముద్ర తీర ప్రాంతంలోని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. తుఫాన్ ప్రభావాన్ని బట్టి ప్రజలను సురక్షిత షెల్టర్లకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

కొండాపురం: తుఫాన్ పట్ల అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. తుపాన్ దృష్ట్యా సిబ్బంది మండల కేంద్రాల్లోనే ఉండాలన్నారు. వీఆర్వోలు వారి పరిధిలోని గ్రామాల్లో వర్షం వల్ల నష్టం కలిగితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం వర్షాల కారణంగా పొంగే వాగులు, వంకలను పరిశీలించి వాటికి సమీప ప్రాంతాల్లో ఉన్న గ్రామ ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కే రవికుమార్, ఏఓ శేషసాయి, ఈఓపీఆర్డీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండండి

ఉదయగిరి: బంగాళాఖాతంలో తుఫాన్ ప్రభావంతో ఉదయగిరి నియోజకవర్గ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు, గాలుల ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నియోజవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజారెడ్డి తెలిపారు. ఆయన శనివారం ఉదయగిరిలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. చెరువులకు గండ్లు పడకుండా ఇరిగేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరినట్లు చెప్పారు.

విస్తృతంగా ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియ



ప్రత్యేక ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న ఆర్డీఓ

సంగం: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు విస్తృతంగా నూతన ఓటు నమోదు చేసుకోవాలని ఆర్డీఓ కురబ మధులత సూచించారు. సంగం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు క్యాంపును ఆర్డీఓ పరిశీలించారు. బీఎల్‌ఓల నుంచి క్లెయిమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. నూతన ఓటు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆ దిశగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్లు ప్రవీణ్‌కుమార్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి


కొండాపురం: ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయా పరిధిలోని ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగ చేసుకోవాలన్నారు.

జలజీవన్ నిర్వహణకు కమిటీని ఏర్పాటు చేయండి

• పీడీ సాంబశివారెడ్డి

సోమశిల: జలజీవన్ మిషన్ నిర్వహణకు సంబంధించి ప్రతి సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సంఘ బంధం సభ్యులతో కలిపి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు. శనివారం అనంతసాగరం వెలుగు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. పీడీ మాట్లాడుతూ మహిళలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలన్నారు. స్త్రీనిధి నగదు రికవరీ వేగవంతం చేయాలని సీసీలకు సూచించారు. జలజీవన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి వేయాలన్నారు. కమిటీ ఏర్పడితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తాయని వివరించారు. సంఘ బంధం సభ్యులు ఐక్యంగా ఉండాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు సంఘాలపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, ఏపీఎం వెంకటరమణరావు, సీసీలు వరకుమారి, లత, అంకమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణశాఖ లక్ష్యాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

ఆత్మకూరురూరల్: ప్రభుత్వం నిర్దేశించిన గృహ నిర్మాణశాఖ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండలంలోని సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సచివాలయంలో వలంటీర్ల వారీగా సమావేశాలు పెట్టుకుని లక్ష్యాలను పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి జగనన్న లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు సకాలంలో పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, దశల వారీగా నిర్మాణం పూర్తయిన ఇళ్లకు బిల్లులు చెల్లించేలా ఎప్పటికప్పుడు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శరత్ చంద్ర, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించండి

ఆత్మకూరు: పట్టణంలోని పలు వార్డుల్లో మురుగు నీరు నిలిచి ఉండడం, దోమలు వ్యాప్తి చెందడం, పలు కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో అపరిశుభ్రంగా ఉన్నాయని వెంటనే మున్సిపల్ అధికారులు పరిశీలించి పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. పట్టణంలోని 3,4 వార్డుల్లో సీపీఎం నాయకులు శనివారం ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య సిబ్బంది చెత్తాచెదారం తొలగించేందుకు సక్రమంగా రావడం లేదని పలువురు తెలిపారని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్‌కే సందానీ, కాలేషా, కోటయ్య, వశీం, కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.